**కథ**

# శిలాక్షరాలు

**"శారదా! నేనలా గుడి వరకు వెళ్ళొస్తాను. ఎవరైనా ఫోన్ చేస్తే గంటలో వస్తానని చెప్పు" అని భార్యకు చెప్పి చెప్పులు వేసుకోబోతుండగా గేటు తీస్కుని మిత్రుడు వెంకటరమణ రావడం కనిపించింది.**

"ఎక్కడికో బయల్దేరుతున్నట్లున్నావు?" అనడిగాడు ఆయన.

"ఇంకేం బయల్దేరడం ఒంటి బ్రాహ్మణుడు ఎదురయ్యాక.." హాస్యంగా అని అతడికి సోఫా చూపించాడు యోగేంద్ర.

"ఈ ఒంటి బ్రాహ్మణుడు నీకోసం శుభవార్త తెచ్చాడు లేవోయ్. ఆ విషయం చెవితే వెళ్ళినవాడివి కూడా పరుగెత్తుకు వచ్చేవాడివి"

"ఏమిటో" తానూ ఆయన ఎదురుగా కూర్చున్నాడు.

ఇతడి గొంతు విని లోపల్నుంచి శారద వచ్చింది.

"బాగున్నారా అన్నయ్యగారూ! ఎప్పుడొచ్చారు భీమవరం నుంచి?"

"నిన్న రాత్రేనమ్మా! సంబంధాలు జేబులో వేసుకుని పరుగు పరుగున వచ్చేసాను వీడిని కలవడానికి"

తాను కూడా కూర్చుని కుతూహలంగా చూసింది శారద.

"ఇంతకీ వైదేహి ఏదమ్మా!"

"వీణ క్లాసులకి పిల్లలొచ్చారు..వాళ్ళతో ఉంది" ఆమె చెప్పుండగానే లోపల్నుంచి వైదేహి వచ్చింది. నలుపుమీద గులాబీరంగు పువ్వులున్న లంగా, గులాబీ రంగు వోణీ, పచ్చని పసిమి ఛాయ మీద నల్లని బ్లౌజు, తలంటుకుని వదులుగా వేసుకున్న జడ..చక్కని ప్రశాంతమైన ముఖం.

తృప్తిగా చూసాడు వెంకటరమణ.

"ఏమైనా చెప్పు నిన్నిలా చూస్తే ప్రాణం లేచొస్తుంది అమ్మా! చక్కగా సాంప్రదాయికంగా కనిపిస్తావు. ఎంత చక్కని వస్త్రధారణ ఇది! కానీ ఈరోజు ఏ పిల్ల ఒంటిమీద చూసినా పంజాబీ డ్రెస్‌లూ జీన్సు ప్యాంట్లూ తప్ప ఇలా నిండుగా ఉన్న ఆడపిల్లలు కనిపించి ఎన్నాళ్ళయిందో.. ఏమిటోనమ్మా రాను రానూ కట్టూబొట్టూ తీరు అన్నీ మారిపోయి అసహజంగా తయారవుతున్నారు"

చిన్నగా నవ్వింది శారద.

నిజమే..లంగా ఓణీ అనేది మరీ కనుమరుగైపోతోంది. భాషతోనూ ఉంటున్న ప్రాంతంతోనూ ప్రమేయం లేకుండా రకరకాల వస్త్రధారణలు మార్కెట్లోకి వస్తున్నాయి.

"ఏమిటి మామయ్యా! రాగానే ఆడపిల్లలూ వస్త్రధారణ అనే టాపిక్ తీసుకున్నారా?" నవ్వుతూ అని తాను తెచ్చిన జంతికల ప్లేటు అతని ఎదురుగా టీపాయ్ మీద ఉంచింది.

"చెప్పు..ఏమిటి విశేషాలు? కలిసావా వాళ్ళని?"

"ఆ..ఆ..అక్కడికే వస్తున్నా..వాళ్ళని కలిసాను. ఫోటో ఇచ్చాను. అమ్మాయిని నచ్చుకుని రేపు సోమవారం చూడడానికి వస్తామన్నారు. అక్కడ అనుకోకుండా ఇంకో సంబంధం తగిలింది. మా తోడల్లుడికి ఏదో దూరపుచుట్టం అట. అబ్బాయి అమెరికాలో ఉంటున్నాడు. రెండేళ్ళయి అక్కడే జాబ్ చేస్తున్నాడు. వాళ్ళూ మంచి సంబంధం దొరికితే చేసేద్దామని చూస్తున్నారు..అబ్బాయి ఫోటో తెచ్చాను."

ఫోటో తీస్కుని పరిశీలనగా చూసాడు యోగేంద్ర.

"అబ్బాయి బాగానే ఉన్నాడు. ఎన్నాళ్ళుంటాడట అమెరికాలో?" "ఎన్నాళ్ళేమిట్రా..ఒకసారి అక్కడికి వెళితే ఇక్కడికి వచ్చి సెటిలయ్యే వాళ్ళెవరుంటారు?"

"వద్దురా..నేనెప్పుడూ అమెరికా సంబంధం చేయాలని అనుకోలేదు. వైదేహికీ అటువంటి ఆలోచన లేదు. ఉన్న నాలుగు రోజులూ పిల్లలని నా కళ్ళ ఎదురుగా ఉంచి చూసుకోవాలనుంది. నాకెప్పుడు ఎవరిని చూడాలన్పించినా ఒకపూట ప్రయాణంతో వెళ్ళి చూడగలిగేటట్లు ఉండాలి. ఈమధ్య వస్తున్న అమెరికా పెళ్ళికొడుకుల కథలు వింటుంటే ఒళ్ళు జలదరిస్తోంది. నా కూతురికి రెండు పూటలా ఇంత చారు అన్నమే పెట్టనీ..ఈ దేశంలో ఉంచే చాలు. కలలో కూడా నాకు అమెరికా సంబంధం మీద ఆసక్తి లేదు" స్పష్టంగా చెప్పాడు యోగేంద్ర.

"ఏమ్మా! నువ్వేమంటావు?" శారదని అడిగాడు రమణ.

"నా అభిప్రాయమూ అదే అన్నయ్యా! అంత దూరం ఇచ్చి ఇక్కడ బెంగపడుతూ ఉండేకన్నా దగ్గర సంబంధమే మంచిది" "సరే..మీ ఆలోచనల్లో సమంజసమూ భయంలో వాస్తవమూ ఉంది. అయితే సోమవారం వాళ్ళని వచ్చి చూడనీ..అంతా సవ్యంగా అయిపోతే ఇది కూడా మంచి సంబంధమే. ఇద్దరే పిల్లలు- ఆడపిల్లకి పెళ్ళి అయిపోయింది. బాధ్యతలు లేవు"

"అదేం మాట అన్నయ్యా! బాధ్యత ఉంటే మాత్రం పంచుకునేందుకేగా భార్య అనేది..బాధ్యతలకి భయపడిపోతే ఎలా?" "అది మనం తరం మాట..ఇప్పుడు ఆడపిల్ల తల్లిదండ్రులు అబ్బాయిలో చూసే అర్హతల్లా అదొకటి. ఏది? పెళ్ళికావలసిన చెల్లెళ్ళు ఉన్నారా? అత్తగారూ మామగారూ వీళ్ళతోనే ఉంటారా? ఈ రెండిటికీ సమాధానం నో అయితే ఆ పిల్లాడు బెస్ట్ వరుడు."

"అలా ఎలా అనుకోమంటావురా..మాకూ ఓ కొడుకు ఉన్నాడుగా"

"అది నీ అభిప్రాయం..ఇప్పటికాలం ఎలా ఉందంటే పిల్లలకి పెళ్ళిళ్ళు చేసాక మనం మన దారి చూసుకోవాలి. వాళ్ళ బ్రతుకు పోరాటంలో మనం వాళ్ళకి డిస్టర్బెన్స్ కాకూడదు. ఈ వాస్తవాన్ని గుర్తిస్తే నిర్లిప్తంగా ఉండవచ్చు. గుర్తించకపోతే మనసు కష్టపెట్టుకోవాలి. నానాటికీ బలహీనమవుతున్న మానవ సంబంధాలకి ఇది గుర్తు"

వెంకట రమణ కోడలి నైజం గుర్తొచ్చి నిశ్శబ్దంగా ఉండిపోయింది శారద.

అనుకున్నట్లుగా సోమవారం పెళ్ళివారు రావడం వైదేహిని చూడడం, నచ్చుకోవడం వెనువెంటనే ముహూర్తాలు పెట్టుకోవడం అన్నీ చకచకా జరిగిపోయాయి. ముహూర్తం అట్టే దూరం లేకపోవడంతో పెళ్ళి పనులు, షాపింగ్ కూడా వెంటనే ప్రారంభించాల్సి వచ్చింది.

కాకపోతే మారిన కాలం పుణ్యమా అని పెళ్ళికి పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు, డబ్బు ఉంటే చాలు. అన్ని పనులూ క్షణాల మీద జరిగిపోతాయి.

మరునాడే ముహూర్తం. చుట్టాలు అధికశాతం ఊళ్ళోనివారే కనుక పెళ్ళి సమయానికి వస్తారు. పై ఊరి నుంచి వచ్చిన వాళ్ళు కొందరు ఇంట్లో ఉన్నారు. మరునాడు ఫంక్షన్ హాల్‌కి తీసుకెళ్ళాల్సిన వస్తువులు సరిచూసుకుంటోంది శారద.

వైదేహి తన గదిలో మేనమామ మేనత్త పిల్లలతో కూర్చుని కబుర్లు చెపుతోంది.

యోగేంద్ర ఒకసారి తొంగి చూసాడు ఆ గదిలోకి. ఆరోజే పెళ్ళికూతురిని చేసినందువలన నుదుట కళ్యాణం బొట్టుతో, పెళ్ళికళతో వెలిగిపోతున్నది వైదేహి ముఖం. కాసేపు తనివితీరా అలాగే చూసి "వైదూ!" అని పిలిచాడు. తలెత్తి చూసిన వైదేహి "ఏమిటి నాన్నా! పిలిచావా?" అంది.

"అవునమ్మా! ఒక్క అయిదు నిముషాలు" తిన్నగా డాబా మీదకి నడిచాడు యోగేంద్ర.

అక్కడ వేసి ఉన్న కేన్ ఛైర్లో తాను కూర్చుని కూతురిని కూర్చోమని చెప్పాడు.

"చెప్పమ్మా..ఏమనిపిస్తోంది? ఈ ఇంటిని వదిలి వెళ్తున్నందుకు బాధగా ఉందా లేక కొత్త జీవితంలోనికి అడుగు పెడుతున్నందుకు ఎగ్జయిటెడ్‌గా ఉందా?" నవ్వుతూ అడిగాడు.


నవ్వింది వైదేహి "కాంబినేషన్.." అని.

"వైదూ! తల్లీతండ్రీ పిల్లలకి ఎందుకు పెళ్ళి చేస్తారో తెలుసా? వారిని తామెంత ప్రేమించినా జీవితాంతం వారితో ఉండలేరు కనుక. తాము వారిని విడిచిపోకముందే వారికో తోడు కల్పించితే తాము నిశ్చింతగా ఉండవచ్చని. అంతే తప్ప తమ బాధ్యత తీర్చుకుందామనో, బరువు వదిలించుకుందామనో లేక పెళ్ళే జీవితానికి పరమార్థమనో కాదు"

అర్థం కానట్లు చూసింది వైదేహి.

"పెళ్ళి చేసుకుని కోటి ఆశలతో అత్తవారింట అడుగుపెడుతుంది ఆడపిల్ల. ఆపైన ఆ కుటుంబాన్ని తన కుటుంబంగా భావించాలి. మగడి బాధ్యతల్లో పాలు పంచుకోవాలి. ఆ ఇంటి బాధ్యత అత్తగారి అనంతరం తాను తీసుకోవాలి. ఆ కుటుంబం తాలూకు వంశాన్ని పరిరక్షించాలి. ఒక మంచి గౌరవప్రదమైన, గురుతరమైన బాధ్యత ఇల్లాలిది. ఈ రకమైన భావాలు నేటి వధువుల్లో ఎక్కడా కన్పించకపోయినా వాస్తవానికి ఇదే ఇల్లాలి పాత్ర!

**శివల పద్మ**



సరే అన్నీ సవ్యంగా ఉంటే సుఖప్రదమైన సంసారం సాగిస్తారు. సంతృప్తిగా జీవితం గడుపుతారు. తల్లిదండ్రులుగా మేము మనసారా కోరుకునేది అదే. కానీ ఏ కారణం చేతనైనా అక్కడ ప్రతికూల పరిస్థితులు ఎదురైతే? చిన్న చిన్న తగవులు, దెబ్బలాటలు, అలకలు, మళ్ళీ కలిసిపోవడాలు ఇవన్నీ సంసారాల్లో మామూలే. కానీ ఇవే శృతిమించితే! దాని వల్ల మనశ్శాంతి కరువైతే?" వైదేహి శ్రద్ధగా వింటోంది. ఆమెకి తెలుసు తండ్రి తనకి మంచి మిత్రుడు కూడా అని.

"ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి గొడవలు పెట్టుకోమని ఏ తల్లిదండ్రులూ చెప్పరు. సాధ్యమైనంత వరకూ సహనం వహించమనే ప్రతి ఆడపిల్లకీ చెపుతారు.

అంటే దానర్థం నీ గతి అంతే అని కాదు. నీ ఆత్మాభిమానాన్ని చంపుకుని బ్రతకమనీ కాదు. ఒక్కోసారి చాలా పెద్ద పోట్లాట కూడా ఒక్కచోట దూదిపింజెలా తేలిపోతుంది-ఎప్పుడు? కాస్తంత మౌనం వహిస్తే..

ఏ మనిషి గురించి మనకి మొదటి పరిచయంలో తెలియదు. వారితో కొంత సమయం గడిపితే క్రమంగా వాళ్ళేమిటో అర్థం అవుతుంది. ఏ కారణం చేతనైనా మనం ఊహించని వ్యక్తిత్వాలు బయటపడితే అది ఆలోచించాల్సిన విషయం.

రేపు పెళ్ళి అనగా ఈ చర్చ మన మధ్యలో రావడం చూడడానికి వినడానికి బాగులేకపోయినా నేటి పరిస్థితులలో ఇది చాలా అవసరం! నేను ముందే చెప్పాను. పెళ్ళి జీవితంలో ఒక భాగమే తప్ప పెళ్ళే జీవిత పరమావధి కాదు.

అవతలి వ్యక్తిని అర్థం చేసుకో- నీవాడిగా భావించు-సహనం వహించు. కానీ ఏరోజైనా ఆ జీవితంతో గానీ ఆ వ్యక్తితోగానీ ఇమడ లేవని నీకనిపిస్తే-ఆత్మవిశ్వాసంతో వెనక్కి వచ్చేయి. నీ జీవితం నీకు ఒకేసారి దొరుకుతుంది. నీ ఆఖరి శ్వాస వరకు నీకు నీ జీవితం ఉంటుంది. దాని విలువ తెలుసుకుని తిరిగి ప్రారంభించు. జీవితం పంచుకోవడానికి వచ్చిన ఒక వ్యక్తి కారణంగా అది ఛిన్నాభిన్నం అవకూడదు. అలా అస్తవ్యస్తం చేసే అధికారం ఆ వ్యక్తికి లేదు. పరువు, ప్రతిష్ఠ, సమాజమూ, లోకులూ ఇవన్నీ మన జీవితంకన్నా ముఖ్యమైనవి కావు. నీలో ఆత్మవిశ్వాసం తగ్గినంత కాలం పరువుగా ఎలా బ్రతకాలో నీకు తెలుసు. ఈరోజు చాలామంది ఆడపిల్లలు పుట్టింటి వాళ్ళ పరువుకోసం అత్తింటి ఆరళ్ళు భరిస్తున్నారు. కొందరు బలైపోతున్నారు. అది వివేకం కాదు. తమ పరువు కోసం కని పెంచిన పిల్లల్ని బలి ఇవ్వాలని ఏ తల్లితండ్రీ కోరుకోరు. చిన్న విషయాలకి సంసారం ఎక్కడ పాడుచేసుకుంటారో అన్న భయం చేత కూతురి వ్యవహారాల్లో తల దూర్చరు తప్ప ఆమె నరకం అనుభవిస్తోందంటే ఏ తండ్రీ మనశ్శాంతిగా ఉండలేడు.

కనుక నేను చెప్పేది ఒకటే తల్లీ! విజ్ఞతతో వ్యవహరించు. వివేకాన్ని కోల్పోవద్దు. ఆ వ్యక్తిగానీ ఆ జీవితంగానీ నీ మనశ్శాంతిని హరిస్తున్నట్లయితే నిస్సంకోచంగా నీ ఇంటికి నువ్వు రావచ్చు. అంతేకాదు పెళ్ళి చేసి పంపించినంత మాత్రాన మేము పరాయి వాళ్ళం అయిపోలేదు. నీ ప్రతి ఆలోచన, మాతో పంచుకో. నీ మనసుకి కష్టం కలిగించేది ఏదైనా జరిగితే దయచేసి మాకు తెలియపరచు. మౌనంగా భరించాలని గానీ దిగమింగాలని గానీ ప్రయత్నించకు. ఆ అవసరం లేదు. నీకు నీ వాళ్ళున్నారు. నువ్వొంటరిదానివి కాదు.

అన్నిటికన్నా ముఖ్యంగా జీవితం విలువ గుర్తించు. అది నీకు భగవంతుడు ప్రసాదించిన వరం. దాన్ని సద్వినియోగం చేయి.

పెళ్ళి చేసుకున్న అందరు ఆడపిల్లల జీవితాలు ఒక్కలా ఉండాలనేం లేదు. నీ అదృష్టం బాగుంటే నీ బ్రతుకు పూల నావలా సాగిపోవచ్చు. భయపడాల్సిందేమీ లేదు. ఒకవేళ అలా కాకపోయినా అప్పుడూ భయపడాల్సింది లేదు. నీ జీవితం ఎలా మలుచుకోవాలో నిర్ణయించుకునే అధికారం నీకుంది. దానిమీద సర్వహక్కులూ నీవి. ఇతరులెవ్వరివీ కావు.

నీ మొదటి మిత్రులు నీ తల్లిదండ్రులని గుర్తుపెట్టుకో..పెళ్ళి చేయడం మా బాధ్యత. అందుకే చేస్తాము. అది మిమ్మల్ని వదిలించుకోవడం కాదు. కొన్ని సంసారాల్లో తెలియక కొన్ని మాటలు, కొన్ని వ్యాఖ్యలు అటువంటి అర్థాన్ని ఇవ్వవచ్చు. అది కేవలం పొరపాటు మాత్రమే. పిల్లలు కష్టపడితే ఏ తల్లిదండ్రులూ చూడలేరు. అది ఆడపిల్లలయినా, మగపిల్లాడయినా.

ఈరోజు పెళ్ళిళ్ళ తర్వాత వచ్చే పరిణామాలను చూస్తుంటే ఆడపిల్లకీ తల్లిదండ్రులకీ ఎక్కడో కమ్యూనికేషన్ గాప్ మిగిలిపోతోంది అనిపిస్తున్నది. అందుకే వారు పెళ్ళయిన తర్వాత తమ సమస్యలని కన్నవాళ్ళతో పంచుకోవడం లేదు. కనీసం కొన్నిచోట్ల అది కనిపిస్తోంది. అందుకే ప్రత్యేకంగా నీతో మాట్లాడుతున్నాను. ఈ విషయాలన్నీ గుర్తుపెట్టుకో. చివరగా నీకు నేను చెప్పేది అతి ముఖ్యమైనదీ ఒకటే- నీకు సమస్యలొస్తే మేముంటే మాతో పంచుకో. మేము లేకపోతే నీ జీవితం విలువ గుర్తుపెట్టుకుని నిర్ణయం తీసుకో. ముందు నువ్వు ఒక వ్యక్తివి. ఆ తర్వాతే ఎవరికైనా భార్యవి. ఇంకెవరికైనా తల్లివి..నీకంటూ ఒక వ్యక్తిత్వం ఎప్పుడూ ఉంది. దాన్ని నిలబెట్టుకో. దాని తర్వాతే మిగతావన్నీ.."

కనిపెంచిన తండ్రి మాటలు ఒక్కొక్కటి శిలాక్షరాల్లా మనసులో ముద్ర పడుతూ ఉంటే -అవి లోలోన కొండంత ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంటే-

తండ్రి అరచేతులు అందుకొని అపురూపంగా ముద్దుపెట్టుకొని చెప్పింది.

"నాకు ఈ ధైర్యం చాలు నాన్నా! ఇది నాకు జీవితాంతం ఉంటుంది"